www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 6 డిసెంబర్ 2023
5
తిరుపతి



రాజ్యాంగ శిల్పి బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాజ్యాంగ శిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా నివాళి అర్పించారు. సందర్భంగా బుధవారం తిరుపతిలోని అంబేద్కర్ విగ్రహానికి టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రజల గుండెల్లో బిఆర్ అంబేద్కర్ చిరస్మరణీయుడని కొనియాడారు. అణగారిన ప్రజల వాస్తవ స్థితిగతులను గుర్తించి వాటి పరిష్కారంలో ప్రపంచానికే ఓ దిక్సూచిగా నిలిచారన్నారు. అంబేద్కర్ ఎప్పటికీ పేద, పీడిత అణగారిన వర్గాల పక్షపాతి అని అన్నారు. (వార్తలు 6వ పేజీలో..)



నివాళి అర్పిస్తున్న టిటిడి చైర్మన్



కుళ్లిన వరి నారు చూపిస్తున్న రైతులు



శ్రీకాళహస్తిలో పేదల ఇళ్లు పరిశీలిస్తున్న సిపిఎం బృందం



దగ్గరుండి విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో సిఎండి

శాంతించిన 'మిచౌంగ్'

మరో రెండు రోజులు వర్షాలా..?
బెంబేలెత్తుతున్న జిల్లా ప్రజానీకం
చెరువులను తలపిస్తున్న కాలనీలు
42,500 ఎకరాల్లో వరి పైరు నష్టం


ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, యంత్రాంగం

ఎట్టకేలకు మిచౌంగ్ తుపాను శాంతించింది.. మంగళవారం అంతా మేఘావృతమై ఉన్న వాతావరణం, బుధవారం 'చుర్రు'మనే ఎండతో ఆనందాన్ని కలిగించింది.. గత నాలుగు రోజులుగా వర్షాలతో బెంబేలెత్తిన జిల్లా ప్రజానీకం బుధవారం ఎండ రావడంతో ఊరట చెందారు.. పునరావాస కేంద్రాల నుంచి పేదలు ఇళ్లకు వెళ్లారు. ఇళ్లల్లోకి నీళ్లు వచ్చిన కాలనీల్లో ప్రజలు వస్తువులన్నీ ఎండలో ఆరబెట్టుకుంటూ ఇళ్లను శుభ్రం చేసుకునే పనిలో పడ్డారు. రెవెన్యూ, విద్యుత్ శాఖ సిబ్బంది వర్షంలోనూ మరమ్మతులు చేస్తూ రవాణాకు, విద్యుత్‌కు అంతరాయం లేకుండా శ్రమించారు. ఇతర జిల్లాల నుంచి అదనంగా సిబ్బందిని రప్పించి యుద్ధప్రాతిపదికన పనులు చేయడంతో మంగళవారం రాత్రికే అంధకారంలో ఉన్న గ్రామాల్లో వెలుగులు నిండాయి. ఇప్పటికే చెరువులను తలపిస్తున్న వరిపైరు పొలాలు ఇంకా వర్షం కొనసాగితే మాత్రం పూర్తిగా నష్టపోతామని రైతులు లబోదిబోమంటున్నారు. జిల్లాలో 42,500 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని ప్రాథమికంగా అధికారులు అంచనా వేశారు.

6,478మందికి ఆశ్రయం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లాలో మిచౌంగ్ తుపాను సందర్భంగా 84 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 6,478 మందికి ఆశ్రయం కల్పించినట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సహాయ చర్యలు చేపట్టామన్నారు. బుధవారం ముఖ్యమంత్రి తుపాను ప్రభావిత ఎనిమిది జిల్లాలైన తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లతో, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా ప్రత్యేక అధికారి శ్యామలరావు, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ తిరుపతి జిల్లాలో తుపాను ప్రభావం 29 మండలాల్లో, 546 గ్రామాలపై పడిందని, 84 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 6478 మందికి ఆశ్రయం కల్పించి వారికి టిఫిన్, భోజనం ఏర్పాట్లు చేశామన్నారు. ఇళ్లకు వెళ్లే సమయంలో ఒకరికి వెయ్యి, కుటుంబానికి 2,500 రూపాయల చొప్పున అందించేందుకు సంబంధిత ఆర్డీవోలకు నిధులు విడుదల చేశామన్నారు. 22,635 మంది కుటుంబాలకు 25 కేజీల బియ్యం, లీటర్ వంటనూనె, కందిపప్పు, ఉల్లి, బంగాళాదుంపలు కేజీ వంతున అందిస్తున్నామన్నారు. గాలుల నేపథ్యంలో 496 గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, బుధవారం సాయంత్రానికి ఐదారు గ్రామాలు మినహా పూర్తిగా పునరుద్ధరిస్తామన్నారు. వాకాడు రహదారిలో రవాణా మార్గం ఇబ్బంది వల్ల ఆలస్యం అవుతోందని వివరించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా బోర్ల వద్ద జనరేటర్లు, ట్యాంకర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆర్ అండ్ బికి సంబంధించి 97 కిలోమీటర్లు, పంచాయతీరాజ్ సంబంధించి 87 కిలోమీటర్లు దెబ్బతిన్నాయని, ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపట్టామన్నారు. విత్తు వేసి నెలరోజులు మాత్రమే అయిన వరి పంట 7126 హెక్టార్లు, హార్టికల్చర్ కు సంబంధించి మిరప, పూల తోటలు సుమారు 246 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందన్నారు. పిచ్చాటూరు వద్ద ఆక్వా ఫామ్ దెబ్బతిన్నదని, పలు పశువులు, దూడలు, గొర్రెలు, మేకలు చనిపోయాయని, కాటిల్ షెడ్స్ దెబ్బ తిన్నాయని వివరించారు. ఈ కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ లీగల్ సెల్ శ్రీనివాస రావు పాల్గొన్నారు.



వరదయ్యపాలెం మండలంలో రోడ్లన్నీ గుంతలే...

లైన్‌మేన్ హెల్పర్‌కు విద్యుత్ షాక్

ప్రజాశక్తి - బాలాయపల్లి తుపాను కారణంగా వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం మరమ్మతుల కోసం ఎక్కుతుండగా లైన్‌మేన్ హెల్పర్ రఘుకు విద్యుత్ షాక్ తగిలి స్పృహ తప్పి పడిపోయిన ఘటన బుధవారం మండలంలోని అంబలపొడి గిరిజనవాడ సమీపంలో చోటు చేసుకుంది. సుధాకర్‌నాయుడు వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం జంపర్ ఇస్తుండగా విద్యుత్ రావడంతో రఘు స్పృహ కోల్పోయాడు. 108లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రఘు గత కొంతకాలంగా విద్యుత్ శాఖలో లైన్‌మెన్ కింద సహాయకుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వెంకటరెడ్డిపల్లికి కరెంట్ మూడు రోజుల నుంచి లేదు. రెండు రోజులుగా అలుపెరగకుండా పనిచేస్తున్న రఘు మధ్యాహ్నం 2 గంటల సమయంలో బాలాయపల్లి సబ్‌స్టేషన్‌కు వెళ్లి ఎల్‌సి ఇవ్వాలని ఫోన్లో మాట్లాడి స్తంభం ఎక్కి జంపురి ఇస్తున్న సమయంలో ఇండెక్షన్ కరెంట్ రావడంతో స్తంభం పైనుంచి బురదలో పడిపోయాడు. చెయ్యి, కాలు కాలాయి. బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం గూడూరుకు తరలించారు. రఘు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

రైతులు లబోదిబో

బిఎన్ కండ్రిగ : తుపాను ఉగ్రరూపం జనజీవనాన్ని స్తంభింపజేస్తే, మరోవైపు రైతులను కోలుకోని దెబ్బతీసింది. గత వారమే నాట్లు వేసిన రైతులు నారు కుళ్లిపోవడంతో సాయం కోసం ఎదురుచూస్తున్నారు. నారు ఎకరాలో వేయాలంటే 15-18వేలు ఖర్చవుతుంది. ఇప్పటికీ వరద నీరు పొలాల్లోనే ఉంది. నాలుగు రోజులుగా ఎంపిడిఒ ఆఫీసు పక్కనే ఉన్న బీసీ కాలనీ అంధకారంలోనే నెలకొన్నా సర్పంచి కనీసం కాలనీ వైపు తొంగిచూడలేదని వారు వాపోతున్నారు.

బాధ్యతగా పంట నష్టం నమోదు చేయాలి

బాలాయపల్లి : తుఫాన్ కారణంగా పంట నష్టం బాధ్యతగా సర్వే చేసి ఏ రైతుకీ నష్టం వాటిల్లకుండా చూడాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని శిరీష పేర్కొన్నారు. బుధవారం మండలంలోని యాచవారం, బాలాయపల్లి, వెంగమాంబపురంలలో పంటలను పరిశీలించారు. 45 రోజులు అయిన పైరుకు ఎటువంటి నష్టం వాటిల్లదని తెలిపారు. నష్టం వాటిల్లిన రైతులకు 80శాతం సబ్సిడీతో విత్తనాలు ఇస్తామన్నారు. తుపాను బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. అంబలపూడి గిరిజన వాడలో ఇళ్లల్లోకి నీళ్లు వచ్చిన వారిని పరామర్శించారు. ఇళ్లల్లోకి నీళ్లు వచ్చి నిస్సహాయ స్థితిలో ఉన్నామని రమణమ్మ వాపోయారు. సర్వేయర్ శరత్‌బాబు, విఆర్ఒ ఆదిశేషయ్య ఉన్నారు.

ఆర్డీవో కిరణ్‌కుమార్ సాహసం



కోట : మండలంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి ఆదేశాల మేరకు మిచాంగ్ తుఫాన్ కారణంగా మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలు వలన గూడూరు డివిజను నందు గల లోతట్టు ప్రాంతాలైన కొత్తపట్నం,వావిళ్ల దొరువు,దైవలాదిబ్బ,సిద్దవరం, గోవిందపల్లిపాలెం, పలు గ్రామాల్లో బుధవారం ఆర్డీవో కిరణ్ కుమార్ పర్యటించారు. దైవాలదిబ్బ గ్రామంలో 18 మంది గిరిజనులు చెరువులు, చేపలగుంటలు, రొయ్యల గుంటల చుట్టూ వర్షం నీరు ఎక్కువ అయిపోవడంతో చిక్కుకుపోయారని సమాచారం అందడంతో వారందరినీ పునరావాస కేంద్రానికి తరలించారు. తహశీల్దార్ పద్మావతి, మండల అభివృద్ధి అధికారి భవాని ఉన్నారు.

ఎకరా వరికి రూ.30వేలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో తుపాను వల్ల వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోయారని, ఎకరా వరికి 30వేలు, ఎకరా వాణీజ్య పంటలకు రూ.50వేలు చొప్పున నష్టపరిహారం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. వేలాది ఇళ్లు కూలిపోయి పేదలు నిరాశ్రయులయ్యారన్నారు. ఇళ్లకు లక్ష రూపాయలు, మృతులకు పది లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌పునరుద్ధరణ కాని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, ఫోన్ ఛార్జింగ్ అయిపోవడంతో కనీసం తమ బంధువులకు సమాచారం ఇవ్వలేని స్థితిలో ఉన్నారన్నారు. విద్యుత్తు వెంటనే పునరుద్ధరించి సంబంధాలు తెగిపోయిన గ్రామాలకు ఆహార , మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

శ్రీకాళహస్తిలో...బుధవారం తొట్టంబేడు మండలంలోని ఈదులగుంట, చెంచులక్ష్మికాలనీ, తంగేళ్లపాలెం, శ్రీరామ్‌నగర్ కాలనీ, బోనుపల్లి, కంచనపల్లి, చేమూరు, చియ్యవరం గ్రామాల్లో పర్యటించి బాధితులను సిపిఎం జిల్లా నాయకులు అంగేరి పుల్లయ్య పరామర్శించారు. ఆస్తి, పంట నష్టాలపై ఆరా తీశారు. వెయ్యి ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని, వందల సంఖ్యలో ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. తుపాను నష్టంపై తొట్టంబేడు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పెనగడం గురవయ్య, గంధం మణి, వెలివేంద్రం ఉన్నారు. సత్యవేడులో సిపిఎం నాయకులు రమేష్ పర్యటించారు.

గిరిజనుల రోదన

నాయుడుపేట : స్వర్ణముఖి అవతల జగనన్న ఇంటి స్థలాల వద్ద 35 గిరిజన కుటుంబాల వారు ఉంటున్నారు. గుడిసెలు పడిపోయి మూడు రోజులుగా భోజనం, కరెంట్ లేక అంధకారంలో ఆకలితో అలమటిస్తూ ఉన్నారు. ఎవరికైనా ఫోన్ చేద్దామన్నా ఛార్జింగ్ లేని పరిస్థితి లేదు. సిపిఎం నాయకులు శివకవి ముకుంద, చంద్రకళ విషయం తెలుసుకుని కమిషనర్‌కు ఫోన్‌లో తెలియజేశారు. కనీసం రాత్రికైనా భోజనం అందించాలని విజ్ఞప్తి చేశారు.

బాలుని కుటుంబానికి రూ.50లక్షలివ్వాలి : సిపిఎం

తిరుపతి (మంగళం) : వెంకటాపురం పంచాయతీ అన్నాసపల్లిలో మంగళవారం ఉదయం కె.నిఖిల్ (11) నీటి ప్రవాహంలో కొట్టుకుపోయినా ఆ బాలుని మృతదేహాన్ని వెలికితీయడంలో అధికారుల నిర్లక్ష్యం తగదని సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, నాయకులు వేణు మండిపడ్డారు. బాలుని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. రెండు రోజులు అయినా బాలుని ఆచూకీ కనుక్కోవడంలో నిర్లక్ష్యం కనబడుతోందన్నారు.

2,500 ఎకరాల్లో పంట నష్టం

వరదయ్యపాలెం : అన్నదాతకు తుపాను అపార నష్టాన్ని మిగిల్చింది. 2,500 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని ప్రాథమిక అంచనా. మూడు రోజుల పాటు విద్యుత్, తాగునీరు లేక గ్రామీణ ప్రాంత ప్రజలు నరకయాతన పడ్డారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి చొరవతో ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. శ్రీసిటీ ఫ్యాక్టరీల కార్మికులను ముందస్తుగా హెచ్చరించి విధులకు వెళ్లకుండా చేశారు. పాములకాలువ వద్ద రేయింబవళ్లు కాపలా కాశారు. భారీ వృక్షాలు నేలకొరగడం వల్ల విద్యుత్ పునరుద్ధరణకు మరో రెండు రోజుల పడుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. సున్నపు కాల్వ వంతెన పూర్తిగా ధ్వంసమయ్యింది. మరమ్మతులు చేపట్టకపోతే ఎప్పటికైనా ప్రమాదమే. నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారాన్ని త్వరగా అందించాలని సత్యవేడు డివిజన్ సిపిఎం నాయకులు జనార్ధన్ డిమాండ్ చేశారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

తిరుపతి బ్యూరో : నెల్లూరు జిల్లాలో అతలాకుతలమైన విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది నిర్విరామంగా కృషి చేస్తున్నారని ఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్ కె.సంతోష్‌రావు చెప్పారు. రెండు రోజులుగా నెల్లూరు జిల్లాలోనే ఉంటూ సూచనలిస్తున్నారు. కర్నూలు, అనంతపురం, కడప సర్కిళ్ల నుంచి అధికారులను, సిబ్బందిని రప్పించి పనిచేయిస్తున్నామన్నారు. వరద ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ఆటంకం కలుగుతోందన్నారు.

ఆదుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం : చింతా



ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమయ్యిందని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. బుధవారం వెంకటగిరిలో పర్యటించారు. 13వ వార్డు మల్లమ్మ టెంపుల్ సవారి గుంటలో నివసిస్తున్న పేద బడుగువర్గాల వారిని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పంట శ్రీనివాస్ రెడ్డి, కలపాటి శ్రీనివాసులు రెడ్డి. ఏ గోపి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఉద్యాన అధికారి శైలజ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో దెబ్బతిన్న ఉద్యాన పంటలను మండల ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ బుధవారం పరిశీలించారు. మండలంలోని గంగుడుపల్లిలో ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శైలజ రైతులతో మాట్లాడుతూ తుఫాన్ కారణంగా పంట నష్టం వాటిల్లిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను ఏ విధంగా కాపాడుకోవాలో రైతులకు వివరించారు.

చెరువును తలపిస్తున్న శ్రామికనగర్

గూడూరు టౌన్ : జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌లో దశాబ్దాలుగా 55 వ్యవసాయ కార్మిక కుటుంబాలు జీవిస్తున్నాయి. తుపాను కారణంగా వరదనీరు ఆ కాలనీని ముంచెత్తింది. కరెంట్ లేక జనజీవనం స్తంభించింది. సిపిఎం నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, ఎస్.సురేష్, అడపాల ప్రసాద్‌లు ఆ కాలనీని సందర్శించి వారి గోడును తహశీల్దార్ లీలారాణికి తెలియజేశారు. మంగళ, బుధవారాల్లో నిరాశ్రయులకు భోజనాలను అందించారు. సచివాలయ అడ్మిన్ బి.కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేశారు. గూడూరు మండల పరిధిలోని కందలి గ్రామానికి సవక కూలీలుగా వచ్చి వరదలు రావడంతో చిక్కుకుపోయిన వలస కూలీలను సర్పంచి బల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రయం కల్పించి భోజన వసతి కల్పించారు. సచివాలయ కన్వీనర్ నవశేఖర్, వేమయ్య పాల్గొన్నారు. తుపాను బాధితులకు అండగా ఉంటామని స్థానిక సంస్థల ఎంఎల్‌సి, ప్రభుత్వ విప్ మేరిగ మురళాధర్ పేర్కొన్నారు. ఇల్లు దెబ్బతిన్న నాలుగు గిరిజన కుటుంబాలకు ఐదువేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. చిట్టమూరు మండలంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్‌రావు పర్యటించారు. కొగిలి పంచాయతీలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్ ఉన్న వంతెన నిర్మాణం జరగలేదని, వరదలు వచ్చిన ప్రతిసారీ రాకపోకలు ఆగిపోతాయన్నారు.

వరి పొలాలను పరీక్షించిన శాస్త్రవేత్తలు

ఏర్పేడు: నచ్చునేరి, నాగంపల్లి, దుర్గపేరి గ్రామాల్లో బుధవారం పి ఏ ఆర్ ఎస్ తిరుపతి తరపున శాస్త్రవేత్తలు బందము వరి పొలాలను పరిశీలించింది. మండలం మొత్తం వరి నాట్లు పడిన పొలాలన్నీ కూడా 20-25 రోజులలోపు వయసు కలిగినవి. కావున ఈ పంటలకి ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వడానికి అర్హత లేదని, రైతులు తమ పంట పొలాల్లో నీటిని బయటకు వదిలి, ఎకరం వరి పొలానికి 20 నుంచి 30 కేజీల యూరియా, 15 నుంచి 20 కేజీల పొటాషియం ను వేసినట్లయితే మొక్క పెరుగుదలలో ఎలాంటి లోపం లేకుండా అధిక పిలకలు రావడానికి దోహదపడుతుందని తెలిపారు. డాక్టర్ కే జాన్ (ప్రధాన శాస్త్రవేత్త), డాక్టర్ పి లత (ఆర్ ఏ ఆర్ ఎస్) పాల్గొన్నారు.

నిత్యవసర సరుకులు పంపిణీ



పల్లంపేట ఎస్టి కాలనీ వరద బాధితులకు నిత్యవసర సరుకులను ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఏర్పేడు మండల ఇంచార్జ్ గున్నేరు కిషోర్ రెడ్డి, మండల అధ్యక్షులు కోనాటి రమణయ్య యాదవ్, కో ఆప్షన్ మెంబర్ బత్తి శెట్టి, చింతలపాలెం సర్పంచ్ బాల ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో 300 ఎస్టి కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందించారు.



ఎంపి, ఎంఎల్‌ఎలపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎంఎల్‌ఎలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై ఉన్న కేసును కొట్టేస్తూ అమరావతిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. టిడిపి హయాంలో తిరుపతి విమానాశ్రయ అధికారులపై దాడి చేశారంటూ అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏర్పేడు పోలీసు స్టేషన్‌లో 2015లో కేసు నమోదు చేశారు. ఎనిమిదేళ్ల పాటు ఈ కేసు విషయమై వీరు కోర్టుకు హాజరయ్యారు. కేసుకు సంబంధించి ఆరోపణలు రుజువు కాకపోవడంతో కేసును కొట్టేస్తూ తీర్పు వెలువడింది. ప్రజాప్రతినిధుల తరపున న్యాయవాదులు మధుకర్‌బాబు, సురేష్, కోటిరెడ్డి వాదనలు వినిపించారు.

నిరవధిక సమ్మెపై అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి - బాలాయపల్లి



అంగన్‌వాడి సిబ్బందికి వేతనాలు పెంచాలని శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నామని తహశీల్దార్ శ్రీనివాసులుకు అంగనవాడి జిల్లా సహాయ కార్యదర్శి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022లో సుప్రీంకోర్టు అంగన్ వాడిలకు గ్రాట్యూటి అమలు చేయాలని ఇచ్చిన తీర్పు నేటికీ మన రాష్ట్రంలో అమలు చేయలేదన్నారు. అంగనవాడి మినీ సెంటర్ లను మెయిన్ సెంట్రల్ గా మార్చలేదన్నారు. హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వలేదని చెప్పారు అంగనవాడిల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా అనేక రకాలుగా చేసిన ఆందోళనపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధ ప్రయోగం చేస్తుందని మండిపడ్డారు. ఈనెల 8వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడి సెంటర్లను మూసివేసి నిరవధిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిరవధిక సమ్మెను ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు మినీ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్తలు ఏ మంజుల, సుమతి, అంగనవాడి ఆయాలు సుజాత, వెంకటమ్మ, సిఐటియు నాయకులు వడ్డీపల్లి చెంగయ్య ఉన్నారు

ఆధునిక విమర్శకు మార్గదర్శకుడు కట్టమంచి

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ ఆధ్వర్యంలో బుధవారం ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం సెనేట్ హాల్ లో నిర్వహించారు. ఆచార్య కట్టమంచి రామలింగారెడ్డి పేరుతో జరిగిన ఈ ఉపన్యాస కార్యక్రమంలో "ఆధునిక సాహిత్య విమర్శ - దక్పథాలు" అనే అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు జి.అరుణకుమారి ప్రసంగించారు. ప్రాచీన కాలం నుండి విమర్శ వుందని, అది వ్యాఖ్యల రూపంలో వుండేదని, ఆధునిక కాలంలో కట్టమంచి రామలింగారెడ్డి విమర్శను విచారం పదంతో సూచించారని, సిపి బ్రౌన్ వంటి మహనీయుల వల్ల గ్రంథపరిష్కరణ మెళకువలు నేర్చుకుందని, రాళ్లపల్లి అనంతకష్ణ శర్మ వేమన పై చేసిన విమర్శ మనకు మార్గదర్శి అని అన్నారు. వర్సిటీ ఇన్ చార్జి వీసీ ఆచార్య జీఎం సుందరవల్లి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ తెలుగుశాఖతో తనకు నాలుగు దశాబ్దాల అనుబంధం వుందన్నారు. ఈ కార్యక్రమాన్నిఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య శ్రీనివాసులురెడ్డి, సునీల్ కుమార్, బ్రహ్మానందరెడ్డి, ఆదిశేషయ్య, అశోక్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మతవిశ్వాసాలను గౌరవించాలి

ప్రజాశక్తి - క్యాంపస్



ప్రతి ఒక్కరూ ప్రజల మత విశ్వాసాలను, ఆచార, సంప్రదాయాలను గౌరవించాలని అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ రీజనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి. లోకేశ్వరి పేర్కొన్నారు. ఎస్ వి క్యాంపస్ పాఠశాలలో విద్యార్థులకు " కమ్యూనిటీ హార్మోని" అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో పాఠాలను చక్కగా అర్థం చేసుకొని అన్ని మతాల వారి విశ్వాసాలను సమానంగా గౌరవించాలని సూచించారు. భారతదేశం ప్రజాస్వామ్యకమైన దేశం అని అన్ని మతాలకు సమానంగా ప్రాతినిథ్యం వహిస్తుందన్నారు. డాక్టర్ కే మంజుల మాట్లాడుతూ ప్రతి ఒక్క మతంలోనూ ఆయా మతానికి సంబంధించిన కర్మ సిద్ధాంతాలు వారు పాటిస్తుంటారని అన్నారు. ఏ దేవుడైన కర్మ సిద్ధాంతాన్ని చెప్పాడని దానికి అనుగుణంగా ప్రజలు నీతి, న్యాయం, ధర్మబద్ధంగా నడుచుకోవాలని సూచించారు. విద్యార్థులు నీతి నిజాయితీగా, స్నేహంగా మెలగాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ అన్య మతాల వారి యొక్క విశ్వాసాలను విమర్శించకుండా, గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం అధ్యాపకురాలు డాక్టర్ సునీత పాల్గొన్నారు.

బకాయి పన్నులపై దృష్టి సారించండి

అధికారులకు కార్పొరేషన్ కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో మునిసిపల్ కార్పొరేషన్ కు రావల్సిన పన్ను బకాయిలపై దృష్టి సారించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో కమిషనర్ బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్నుల వసూళ్ల విషయంలో అలసత్వం వద్దని, ఇంటి పన్నులు రూ.26 కోట్లు, నీటి కుళాయి పన్నులు రూ.9 కోట్లు, భూగర్భ డ్రైనేజి పన్నులు రూ.4 కోట్లు వరకు ఇంకా వసూలు కావల్సి వుందని, రెవెన్యూ అధికారులు పన్నుల బాకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. పన్నులు లేకుండా ఏ భవనం వుండకూడదని నగరంలో అన్ని భవనాలను, ఖాళీ స్థలాలను పూర్తి స్థాయిలో పరిశీలించాలన్నారు. నీటి కుళాయి కనెక్షన్ల పన్నులు చెల్లించకపోతే, కనెక్షన్ కట్ చేయాల్సి వస్తుందని బకాయిదారులకు తెలపాలన్నారు. పన్నుల బకాయి వసూళ్ల విషయంలో సచివాలయ అడ్మిన్లు, అమ్నెటీ, ప్లానింగ్ సెక్రటరీలతో ఏర్పాటు చేసిన టీమ్ ద్వారా పని చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కెఎల్‌వర్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

అధ్యాపకురాలు చండికుమారికి విశిష్ట శాస్త్రవేత్త అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం అప్లైడ్ మైక్రో బయాలజీ విభాగం ఆచార్యులు డాక్టర్ చండీ కుమారి విశిష్ట శాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును ఇండియా నేసియాలోని బాలి ప్రాంతంలోని ఉదయాన యూని వర్సిటీ ఆధ్వర్యంలోని నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ సస్టైనబులిటీ డివిజన్ వారు 4 వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రదానం చేశారు. ఆచార్య చండీ కుమారి చేసిన బోధన, పరిశోధన సేవలను గుర్తించి ఈ అవార్డును ఇండోనేషియాలో బహూకరించినట్లు పేర్కొ న్నారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధ కులు, వర్సిటీ ఉన్నతాధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



చండికుమారికి అవార్డు అందిస్తున్న ఇండోనేసియా యూనివర్సిటీ అధికారులు

ముంపు పంటలు పరిశీలన

ప్రజాశక్తి -పిచ్చాటూరు: మండలంలో రాస్ శాస్త్రవేత్త బి.వి భాస్కర్ రెడ్డి, కె.వి కె ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు నాయుడు, సత్యవేడు డివిజన్ వ్యవసాయ సంచాలకులు సుబ్రమణ్యం, జిల్లా వనరులు ఏడిఏ వేణుగోపాల్ , వ్యవసాయ అధికారి సంజీవి రెడ్డి మండలంలోని ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను ముంపు గ్రామాలలో పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. నీటిని బయటకు పంపించి, అవసరమైనచోట ఎకరాకు 20నుంచి 30 కేజీల యూరి యా చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు.

లోతట్టు ప్రాంతాల్లో భోజనం పంపిణీ

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి రూ.10 ఫీజుతోనే వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ కళాధర్ మంగళవారం భోజనం అందించారు. కైవల్య నది ప్రాంతం ఒడ్డున్న ఉన్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి అన్నం ప్యాకెట్లను అందించారని గొల్లగుంట మురళి తెలిపారు.



చేనేత మగ్గం గుంటలు పరిశీలన

చేనేత కార్మికుల మగ్గం గుంతలను మున్సిపల్ చైర్ పర్సన్ నక్క భానుప్రియ వివిధ ప్రాంతాలలో బుధవారం పరిశీలించారు. నాలుగు రోజులుగా మగ్గం కార్మికులు జీవన భృతిని కోల్పో యారన్నారు. నష్టం అంచనాలను నియోజకవర్గ సమన్వయ కర్త రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి తెలియజేసి నష్టపరిహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, చేనేత రాష్ట్ర కమిటి సభ్యులు నక్క వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంత

ఆదమరిస్తే అంతే !

భారీ గుంతలతో భయాందోళన

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట పాత చెక్‌పోస్టు సమీపంలోని కెనరా బ్యాంక్ ఎదురుగా రోడ్డు మధ్యలో భారీ గుంత ఏర్పడింది. మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో భారీగా కురిసిన వర్షాలకు రోడ్డుమీద వర్షపు నీరు నిలిచింది. ఆ మార్గంలో వాహనాలు రాకపోకలు జరగడంతో భారీగా గుంత ఏర్పడింది. ఆ గుంత కాస్త పెద్దదిగా మారి ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనదారులు కార్లు, ఆటోలు ఆది మరచి ప్రయాణిస్తే భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు తక్షణం స్పందించి ఆ రోడ్డుపై ఉన్న గుంతకు మరమ్మతులు చేపట్టి వాహనదారులకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పీర కుమార్‌కు డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న అర్థశాస్త్ర అధ్యాపకులు పీర కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు పీర కుమార్ కు విక్రమ సింహపురి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈయన 'వృద్ధి, అస్థిరత, సరఫరా ప్రతిస్పందనలు (ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రధాన పంట లపై అధ్యయనం)' అనే అంశంపై చేసిన పరిశోధనకు అర్థశాస్త్రంలో డాక్టరేట్ ను పొందారు. సీనియర్ ప్రొఫెసర్ ఎన్.ఆర్.వి. రమణారెడ్డి మార్గదర్శకత్వంలో పీర కుమార్ పరిశోధన చేసి విశ్వవిద్యాలయానికి సిద్ధాంతం సమర్పించారు. ప్రతి మనిషికీ ఆహారం అత్యవసరమని ఇది తగినంత ఉత్పత్తి అయినప్పుడే మానవ సంక్షేమం, తద్వారా దేశ అభివృద్ధి సాధ్యమ వుతుందని, అందుకు వ్యవసాయం అనుకూల వాతావరణాన్ని రైతులు కల్పించు కోవా లన్నారు. విధాన నిర్ణేతలు తోడ్పాటు అందిం చాలని, ప్రభుత్వం సుస్థిర అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టాలని ఈ సిద్ధాంతం విశ్లేషణ అర్థమవుతోంది. సిద్ధాంత పరిశీలనకు వచ్చిన బహిర్గత పరిశీలకులు ఈ సిద్ధాంతం సంతృప్తికరంగా ఉందని ప్రశంసించారు. పీర కుమార్ గతంలో వ్యవసాయాన్ని ప్రోత్సహించే వివిధ దూరదర్శన్, సప్తగిరి ఛానల్ లో ప్రసారమైన టెలి ఫిల్మ్ లలో (కరువు సీమలో కాంతి రేఖలు, నవోదయం మొదలైనవి) కథానాయకుడిగా కూడా నటించి ఉండడం విశేషం. యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించడంతో కళాశాల అధ్యాపకులు మిత్రులతో సహ నెల్లూరు టీవీ సినిమా నాటక రంగ కళాకారులూ ఆయనను అభి నందించారు. పీర కుమార్ తనకు పరిశోధన పై ఆసక్తిని రేకెత్తించి మార్గదిశానిర్దేశం చేసిన గైడ్ సీనియర్ ప్రొఫెసర్ ఎన్ఆర్‌వి రమణారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న బిఎల్‌వోలు, విఆర్‌వోలు

ఈవీఎంలపై అవగాహన

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: రానున్న ఎన్నికలలో ఈవీఎంల పని విధానం వాటిని ఏ విధంగా ఓటర్లు ఉపయోగించుకోవాలి? అనే దానిపై అవగాహన కల్పించారు. మండలంలోని ఎల్లమంద, బోడేవాండ్లపల్లి, విఆర్ అగ్రహారం, ఉస్తికాయలు పెంట, ఓఎస్ గొల్లపల్లి, పంచా యతీలలోని ఓటర్లకు సంబంధించి స్థానిక సచివాలయాల్లో ఈవీఎం మిషన్లను ప్రాక్టికల్‌గా ఏ విధంగా ఉపయోగించాలనే విధానం పై ఓటర్లకు బిఎల్‌వోలు, వీఆర్వోలు వివరించారు. ఈవీఎంలపై ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసు కోవాలని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి, టిడిపి నాయకులు, స్థానిక సర్పంచులు వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందజేత : ఎడిఎ

ప్రజాశక్తి-కోట : మండలంలోని గూడలి పంచాయతీలో తుపాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను ఎడిఎ ఉమ, ఎఒ వి.నిరంజన్‌కుమార్ పరిశీలించారు. దెబ్బతిన్న వరి పొలాలకు 80శాతం రాయితీపై విత్తనాలు అందజేస్తామన్నారు. గోవిందపాలెం, ఉచ్చురువారిపాలెం గ్రామాల్లో గూడూరు మాజీ శాసనసభ్యులు పాశం సునీల్‌కుమార్ చెరువులను పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. పేదలకు దుప్పట్లను అందజేశారు.

సీపీఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మనిషి గుండెపోటుకు గురైనప్పుడు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు నిలుపుకునేందుకు అనుసరించాల్సిన సిపిఆర్(కార్డియో పల్మనరీ రిసస్సిటేషన్) విధానంపై స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం అవగాహన కల్పించారు. దేశవ్యాప్త ఎన్బీఈ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంవో మధు, ఫిజీషియన్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ శివరామకృష్ణారెడ్డిల పర్యవేక్షణలో నర్సింగ్ విద్యార్థులకు వ్యక్తికి గుండెపోటు వచ్చినప్పుడు సిపిఆర్ ఎలా చేయాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ విధానం ద్వారా 30 శాతం వరకు గుండెపోటుకు గురైన వ్యక్తులను ప్రాణాలతో రక్షించవచ్చని వైద్యులు తెలిపారు. సిపిఆర్ విధానం పై వైద్య విద్యార్థులు అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు.



ఘనంగా ప్రపంచ మృతికా దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతిలో ప్రపంచ మృతిక దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. 2023 వ సంవత్సరానికి నేల– నీరు–జీవనాధారం అనే అంశంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రధానంగా నిర్ణయించింది. సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేలకోతకు గురికావడానికి గల కారణాలను, సంరక్షణ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఈశా ఫౌండేషన్ స్వచ్ఛంద సేవకులైన డాక్టర్ కిషోర్ కుమార్ (మానసిక వైద్య నిపుణులు), డాక్టర్ నీలిమ (చర్మవ్యాధి నిపుణులు) నేల పరిరక్షణ కోసం వారు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కెవి నాగ మాధురి మృతిక విభాగం వారు నేలకు, నీటి సంరక్షణ కోసం సభలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బోధన బోధనేతల సిబ్బంది, పాలిటెక్నిక్ విద్యార్థులు, శాస్త్రవేత్తలు డాక్టర్ పి భాస్కర్ రెడ్డి డాక్టర్ ప్రతిమ, డాక్టర్ లత, డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ తిరుమలరెడ్డి, డాక్టర్ మదన్మోహన్, వెంకటేశ్వర్లు , డాక్టర్ హారతి పాల్గొన్నారు.

రజక వృత్తి దారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-నాయుడుపేట: రజక వృత్తిదారులను ఆదుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఏపీ రజక వృత్తి దారుల సంఘం నాయుడుపేట మండల అధ్యక్షులు కళాతురు రమణయ్య, అధ్యక్షతన నాయుడుపేట వేదనపర్తి సుందర రామిరెడ్డి భవనంలోని సిఐటియు కార్యాలయంలో రజకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు కళాతురు రమణయ్య, కార్యదర్శి అక్కరపాక పుట్టయ్య మాట్లాడుతూ రజక వృత్తి దారులకు సబ్సిడీ పై రుణాలు మంజురు చేయాలని డిమాండ్ చేశారు. మీచౌంగ్ దాటికి తుమ్మూరు గ్రామంలో రజకుల ఇళ్లలోకి నీరు రావడంతో వాషింగ్ సామాను, ఆహారం సామగ్రి, ఎలక్ట్రికల్ వస్తువులు, పూర్తిగా దెబ్బతిని జీవనం లేక రోడ్డు మీద కట్టుబట్టలతో ఉన్నామని ఆర్థిక సాయం చేసి జీవనోపాధికి తోడ్పడాలని కోరుకుంటున్నామన్నారు. తమకు దోభీఘాట్ మంజూరుకు అధికారులకి ఎన్ని సార్లు అర్జీ రూపంలో మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని తహశీల్దారు, కమిషనర్ స్పందించి దోభీఘాట్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో చీపినేటి మోహన్ , ఓజిలి.వీరాస్వామి, నంద్యాల. చెంగయ్య, చెంబెటి, శ్రీనివాసులు, బాబు, లక్ష్మయ్య పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రజకవృత్తి దారుల సంఘం నాయకులు

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపి గెలుపు తోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ లభిస్తుందని చిత్తూరు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు, పుత్తూరు రూరల్ క్లస్టర్ ఇంఛార్జ్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలం గోపాలకృష్ణాపురం గ్రామంలో భవిష్యత్తు గ్యారంటీ పథకాలపై బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అందించబోయే శక్తి, యువగళం, పూర్‌టురిచ్, బీసీలకు రక్షణ చట్టం, తల్లికి వందనం, అన్నదాత, సురక్షిత మంచినీరు వంటి సూపర్ సిక్స్ పథకాలను గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పుత్తూరు రూరల్ అధ్యక్షులు డి రవికుమార్, మాజీ అధ్యక్షుడు కరుణా యాదవ్, ప్రధాన కార్యదర్శి ఏ బాలాజీ, మాజీ ఎంపీటీసీ పాండు రంగయ్య, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, టీడీపీ నాయ కులు చిన్నా, బాలకృష్ణా రెడ్డి, గంగా కుమార్, హరి పాల్గొ న్నారు. టిడిపి క్లస్టర్ ఇంఛార్జ్ గాలి జీవరత్నం నాయుడు, పుత్తూరు మున్సిపాలిటీ 16వ వార్డు పరిధిలోని స్వామి స్ట్రీట్ లో భవిష్యత్తుకు గ్యారెంటీ – బాబు ష్యూరిటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికలలో టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ లక్ష్మణాచారి, జిల్లా టిఎన్‌టియుసి అధ్యక్షుడు రావిళ్ల మాధవ నాయుడు, రాష్ట్ర టిఎన్‌టియుసి కార్యదర్శి ఇ.రవి, టిడిపి నాయకులు రమేష్, పాల భాస్కర్, కన్నా, ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ రాజు, అశోక్, సి.ఎస్.గోపి పాల్గొన్నారు.



ఇంటింటికీ టిడిపి పథకాలను వివరిస్తున్న మాధవయ్య

స్మార్ట్ సిటీ పనులపై కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో చేపట్టిన స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై తిరుపతి స్మార్ట్ ఎండి అండ్ సిఈఓ, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో పాత మునిసిపల్ కార్పొరేషన్ స్థలంలో నిర్మిస్తున్న ఐట్రిపుల్ సి భవన నిర్మాణ పనులను పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిం చాల న్నారు. ఐట్రిపుల్ సి బిల్డింగ్ పనులు పూర్తి అయితే తిరుపతి నగరపాలక సంస్థ నూతన భవనం నుండి ప్రజలకు అందుబాటులోకి వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకొని పనుల వేగవంతానికి కృషి చేయాలన్నారు. రైల్వేస్టేషన్ పార్సిల్ ఆఫీస్ ఎదురుగా నిర్మిస్తున్న మల్టీలెవల్ కార్ పార్కింగ్ పనులపై మరింత శ్రద్ధ తీసుకొని నిర్మాణ దారులతో సమన్వయం చేసుకొని పనులు వేగవంతం చేయాలని తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి అండ్ సిఈఓ, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, స్మార్ట్ సిటీ జి ఎం చంద్రమౌళి, ఎంఈ చంద్రశేఖర్, ఏయికామ్ సంస్థ ప్రతినిధి బాలాజీ, డిఈలు విజయకుమార్ రెడ్డి, శ్రావణి, రాజు, ఏఎఒ రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు త్రిసాయుధ దళాల పతాక దినోత్సవం


ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఈ నెల 7వతేదీ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో త్రిసాయుధ దళాల ప్రతక దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి విజయశంఖర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత సైన్యంలో మాతృ భూమికి విశిష్ట సేవలను అందిస్తూ తమ జీవితాలను త్యాగం చేసిన వీర జవానులను త్రిసాయుధ సైనికులలో, ప్రస్తుతము విశేష సేవలతో దేశ సౌభ్రాతృత్వంను, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, దేశ సరిహద్దులను కాపాడటంలో నిరంతరం సేవలను అందిస్తున్న సైనికులు, వారి కుటుంబ సభ్యులు, మాజీ సైనికుల త్యాగనిరతిని చాటి చెప్పడానికి త్రిసాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నామని భాగ స్వామ్యులు కావాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని రాస్ భవనం, ఎయిర్ బై పాస్ రోడ్‌లో నిర్వహించనున్నట్లు ఆశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, విభిన్న ప్రతిభావంతుల కోసం పని చేస్తున్న సంఘాల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.


క్రైం న్యూస్

ముగ్గురు విద్యార్థుల అదృశ్యం

తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు







ప్రజాశక్తి -తిరుమల: తిరుమలోని స్థానిక ఆర్బీసీ సెంటర్‌కు చెందిన ముగ్గురు చిన్నారు లు బుధవారం మధ్యా హ్నం అదృశమయ్యారు. తిరుమల టుటౌన్ ఎస్ఐ సాయి నాథ్ చౌదరి కథనం మేరకు.. తిరుమలకు చెందిన ఎస్ కృష్ణ తనయుడు చంద్రశేఖర్, యోగేశ్ కుమారుడు వైభవ్ యోగేశ్, శ్రీవరదన్ అదృశ్యమైనట్లు తెలిపారు. అదృశ్యమైన ముగ్గురు పిల్లల వయసు 13 సంవత్సరాలు. ముగ్గురు విద్యార్థులు తిరుమలలోని ఎస్వీ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నారు. మధ్యాహ్నం పుస్తకాలు తెచ్చుకునేందుకు ఇంటికి వెళతామని పాఠశాలలో చెప్పారు. ఇంటికి వచ్చి ల్యాప్‌టాప్ తీసుకుని బస్సెక్కి తిరుపతి ఏడు కొండల బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడ్నుంచి వారి ఆచూకీ తెలియలేదు. విద్యార్థులు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు, పాఠశాల టీచర్లను ఆరా తీశారు. వారు కూడా తెలియదని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2 టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మందులు పంపిణీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: జన్మభూమి స్ఫూర్తితో తన పంచాయతీలోని గిరిజనులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేందుకు తాను అన్ని విధాలా సహకారం అందిస్తానని ప్రముఖ వైద్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బిఎన్ కండ్రిగ మండలం పెద్దపాలవేడు పంచా యతీ పరిధిలోని స్వంత గ్రామం చిన్నపాలవేడు గిరిజన కాలనీలోఈ కార్యక్రమం చేపట్టారు. ఇరవై ఐదు కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అందరికీ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడులో స్థిరపడిన తాను టిడిపి ప్రభుత్వం చేపట్టిన జన్మభూమికి ఆకర్షితుడినై పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లోనూ సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సుధాకర్ నాయుడు, కాశీబాబు, విజయశేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.



దుప్పట్లు, మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు వెంకటేశ్వర్లు

9న లోక్ అదాలత్ ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తి కోర్టు ఆవరణలో ఈ నెల 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. స్థానిక కోర్టులో బుధవారం న్యాయమూర్తులు సమావేశమయ్యారు. జాతీయ లోక్ అదాలత్ లో పాల్గొనడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అన్ని రకాల కేసులకు తక్కువ సమయంలో, ఎలాంటి రుసుము లేకుండా పరిష్కారం చూపే అదాలత్ లో ఎక్కువ మంది కక్షి దారులు పాల్గొనేలా అధికారులు చొరవచూపాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ పాల్గొన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో రిజర్వేషన్లను కాపాడుకుందాం: డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పోరాట స్ఫూర్తితో రాజ్యాంగ రిజర్వే షన్లను దళితులు కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొ న్నారు. స్థానిక అంబేద్కర్ భవనం ఆధ్వర్యంలో అంబేద్కర్ 67వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి, సబ్ రిజిస్ట్రార్ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి అపరంజి, కోశాధికారి కుప్పయ్య, కౌన్సిలర్ బాలసుబ్రమణ్యం, కౌన్సిలర్ జాన్ కేనడి, దళిత పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, పి శంకరయ్య, డాక్టర్ రాజేంద్ర పాల్గొన్నారు.



తిరుపతి కమిషనర్ కార్యాలయంలో

తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణ, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, తుడా సెక్రటరి లక్ష్మీ, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఏర్పేడు : జైభీమ్ రావు ఆశయ సేవా సంఘం సీతారాంపేట వారు అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. ఏర్పేడు మండల కేంద్రంలో అంబేద్కర్ యువ జన సంఘం అధ్యక్షులు పిల్లపాలెం వాసు, ఉపాధ్యక్షులు శంకరయ్య, చంద్ర, జయ, గురవమ్మ, గోపి, కండి సురేంద్ర బాబు, భరత్ కుమార్, ఎంపీటీసీ , అంబేద్కర్‌కి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

పాకాల: మండలంలో అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కెవిపిఎస్ చంద్రగిరి నియోజకవర్గ ఉపాధ్యక్షులు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో మండల కెవిపిఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండలంలో పెన్షనర్ కార్యాలయం వద్ద, మొగురాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు సునీత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో బుధవారం అంబేద్కర్ చిత్ర పటానికి ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు నాదెండ్ల మురళి పుష్పాం జలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, వేణుగోపాల్, దాసు, దేవేంద్ర, లక్ష్మయ్య, జగన్నాథం పాల్గొన్నారు. బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ చిత్ర పటానికి మండల టిడిపి అధ్యక్షులు యం సుధాకర్ నాయుడు పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.

యర్రావారిపాలెం: అంబేద్కర్ వర్ధంతిని మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, దళిత గిరిజన సంఘాల మండల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జోహార్లు పలికారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు సుండుపల్లి రవి, పల్లిపాకు నాగరాజు,దొరబాబు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రెడ్డిశ్వర్, నాగేంద్ర, వెంకటేష్, చంగల్ రాజు, మునిస్వామి, జయేంద్ర పాల్గొన్నారు.

గూడూరు రూరల్ : గూడూరు లోని అశోక్ నగర్ వద్ద అంబేద్కర్ విగ్రహా నికి, పాత బస్టాండ్ వద్ద విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రామచంద్రాపురం: అంబేద్కర్ 67వ వర్ధంతిని టిడిపి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. రామచంద్రాపురం కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పాలాభి షేకం చేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో టిడిపి మండల మాజీ అధ్యక్షుడు కోరా హరి ప్రసాద్, టిడిపి సీనియర్ నాయ కులు కే నరసింహారెడ్డి, టిడిపి నాయ కులు పూజారి సుబ్రహ్మణ్యం యాదవ్, ధనంజయ రెడ్డి, సి రవికుమార్, కే గిరిధర్ రెడ్డి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేణిగుంట : దేశంలో ప్రతి ఒక్కరు అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మాజీ ఉద్యోగి జూలియన్ రాజు పిలుపునిచ్చారు. విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రేణి గుం ట సర్పంచ్ నగేషం, మండల కో–ఆప్షన్ సభ్యుడు అసన్ సాహెబ్, రైల్వే పెన్షన్ అసోసియేషన్ నాయకులు జయంత్ కుమార్, జాన్ బాబు మదిన షరీఫ్, చెంచురెడ్డి తిమ్మారెడ్డి, వెంకటేశ్వర్లు ,పాల్గొన్నారు.



రేణిగుంటలో

అంబేద్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలని అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేద్కర్ స్టార్ కృష్ణ కోరారు. అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి తిరుపతి ఎమ్మెల్యే టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, అంబేద్కర్ స్టార్ కృష్ణ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో ఆ సంఘం నాయకులు డాక్టర్ పరమ శివన్, డాక్టర్ ప్రసాద్, త్యాగరాజు, జే భాస్కర్, మహేష్, ప్రసాద్, సురేష్, చెన్న కేశవ, రాధాకృష్ణ, చెంగయ్య, కృష్ణయ్య టిటిడి ఆనంద రావు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ సాయిబాబా గుడి వద్ద అంబేద్కర్ విగ్రహానికి బుధవారం పూలమాలవేసి నివాళులు అర్పించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అంగన్‌వాడీ వర్కర్స్ లకు చెప్పిన హామీలను వెంటనే అమలు చేయాలని లేనిపక్షంలో ఈ నెల 8వ తేదీ నుండి పిచ్చాటూరు ఎంపీడీవో కార్యాలయం ముందు నిరవధిక దీక్ష చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాణి, భారతి, అముద, గిరిజ, పరమేశ్వరి, కృష్ణవేణి, గ్లోరి హెల్పర్స్ మోనిష, చంద్రమ్మ, విజయ, రాజేశ్వరి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కోట : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అంబేద్కర్ విగ్రహానికి నాయకులు ఆర్‌వి రమణయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ రిటైర్డ్ హోమియోపతి డాక్టర్ పోలయ్య, యువ నాయకులు సాయి, పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడే హరి చౌహన్ నాయక్ నివాళు లర్పించారు. పిసిసి ప్రధాన కార్యదర్శి గౌడపేర చిట్టిబాబు ఆధ్వర్యంలో జీవకోనలోని రాజీవ్ గాంధీ కాలనీ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిసిసి తిరుపతి జిల్లా ఛైర్మన్ శివ శంకర్ పాల్గొన్నారు. చంద్రగిరి లోని అంబేద్కర్ విగ్రహానికి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతమాకుల పుణ్యమూర్తి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిన్నగొట్టిగల్లు: ఎంపిడిఓ కార్యాలయం లో ఈఓపిఆర్డీ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో కలసి అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి .నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో సెక్రటరీ మదనమోహనరాజు, సిబ్బంది వసంత కుమారి, కల్పన, హిమ బిందు, యోగేష్, శ్రీరాములు, ఇమ్రాన్ ఎమ్మార్పియస్ నాయకులు గురుశంకర్, ఇతర దళిత నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పుత్తూరు పురపాలక సంఘంలో అంబేద్కర్ చిత్ర పటానికి మున్సిపల్ ఛైర్మన్ ఎ హరి, పురపాలక సంఘ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి, వైస్ ఛైర్మన్ డి జయ ప్రకాష్, డి శంకర్, వార్డు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పురపాలక సంఘ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.



శ్రీకాళహస్తిలో

శ్రీకాళహస్తి: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అందరివాడని కేవీపీఎస్ డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి సురేష్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ కూడలి లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ అంబేద్కర్ అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతి, చైతన్యం కోసం పాటు పడ్డాడని గుర్తు చేశారు. అయితే కొందరు స్వార్థపరులు కొందరికే పరిమితం చేస్తూ రాజకీయ పబ్బం గడుపు కుంటున్నారని వాపోయారు. ఆయన ఆశయాల సాధనకు అందరం నడుం కట్టాలని పిలుపు నిచ్చారు. నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, ధనంజయులు, వెలివేంద్రం, ఉస్మాన్ బాషా పాల్గొన్నారు.

క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం అకాడమిక్ భవనం లో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ముఖ్య అతిథి విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ పి.వెంకటరావు, ఎస్.సి సెల్ లైజన్ ఆఫీసర్ డాక్టర్ జె.బి. చక్రవర్తి స్కూల్ ఆఫ్ సాహిత్య సంస్కృతి డీన్ ప్రొఫెసర్. సి.లలితరాణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ చందూలాల్ , ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్రవంతికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అప్లైడ్ మాథెమాటిక్స్ విభాగం పరిశోధక విద్యార్థి కె.స్రవంతికి డాక్టరేట్ ప్రదానం చేసి నట్లు పరీక్షల నియంత్రణ కార్యాలయం అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఎం. శివ పార్వతి పర్యవేక్షణలో "ఏ స్టడీ ఆన్ సండామినేషన్ పారామీటర్స్ అండ్ టోపోలోజికల్ ఇండిసెస్ అఫ్ మోలిక్యూలర్ గ్రాఫ్స్" అనే అంశం పై సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీ కి సమర్పించినట్లు తెలిపారు. స్రవంతి పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లలో అనేక పరిశోధనా వ్యాసాలను ప్రచురిం చినట్లు వెల్లడిం చారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు ఆమెకి శు భాకాంక్షలు తెలిపారు.